# అడవిలోని ఆణిముత్యం



కథానిక

సర్వే క్యాంపువారి డేరాలు బొత్తిగా తల్మా నది గట్టుమీదే వేసేరు. అక్కడ డేరాలు కొట్టడానికి అనుమతి యిచ్చేముందు దాని అధికారి అయిన శశిభూషన్ వెనకాముందూ చాలా ఆలోచించేడు. ఆ ప్రాంతంలో పులులు పట్టపగలే తిరుగుతుంటాయని ఊరుమనిషి ఎవరో అన్నాడు వెనక ప్రక్కన బొత్తిగా నది. దాని గట్లు అంచులలో గచ్చపొదలు దట్టంగా అల్లుకొనివున్నాయి. ముందు కాస్తదూరాన ఒక పూరిగుడిసెవుందికాని దాన్లోనూ నరసంచారం అట్టే వున్నట్లు లేదు. అసలు తల్మాగ్రామం అక్కడికి రెండుఫర్లాంగులలో వుంది. కాని, పూరిని అనుకుని క్యాంపు వెయ్యడం శశిబాబుకి సుతరామూ యిష్టంలేదు. మానవ సమూహానికి ఎంత దూరాన వుంటే అంత మంచిదని అతని ఊహ. నిర్మలమైన నీరూ, స్వచ్ఛమైన గాలీ ఈ రెండూవుంటే అతనికింకేమీ అక్కరలేదు. ఆ పూరిగుడిసె నానుకునే మంచినీటి బావి ఉంది. నదిగట్టున ఇక గాలికి లోటేమిటి? ఇక పులులూ, పుట్రానా? వాటికి భయపడే ఘటంకాదు శశిబాబు. ఎంతైనా పడుచువాడుగదా! అందుకే బాగా ఆలోచించి ఆ ప్రాంతాన డేరాలు వెయ్యడానికి అనుమతి యిచ్చేడు. ఉండేవి పట్టున పదునైదురోజులు. ఉన్నవి మూడేమూడు డేరాలు. ముందున్న పెద్ద దానిలో తానూ వెనుకవేసిన రెండు చిన్నడేరాలలోనూ అతని వంటువాడూ, పనిచేసే ఆరుగురు మేస్త్రీలూ వుంటారు.

పనివాళ్లు డేరాలు వేస్తూండగా శశిభూషన్ ఏమీ తోచక బావివద్దకు వెళ్లేడు. అప్పటికి సాయంత్రం అయిదయింది. అతడు బావిలోకి తొంగిచూచి, ప్రక్కనే పడివున్న పాతబొక్కెనతో నీళ్ళుతోడి, చేతులూముఖమూ కడుక్కుని చేరుమాలుతో తుడుచుకొంటూంటే ఆ గుడిసెలోంచి ఎవరో తొంగిచూస్తున్నట్లయింది. అతడా వైపు చూసి, "ఎవరక్కడ" అని కేకవేసేడు. దానికి సమాధానంగా–

"మగవాళ్లు ఇంటిలో లేరు"అంటూ ఒక స్త్రీ కంఠం చెవుల్లో గింగురుమంది. శశిబాబు అటువైపు రెండడుగులువేసి, "ఈ యిల్లెవరిది?" అని అడిగేడు.

ఈమారు ఒక యువతి తలుపుతీసుకుని బయటకువచ్చి "మాటాయనవచ్చేక పంపిస్తాను. ఏం కావాలో ఆయననడగండి"అంది. శశిభూషన్ ఆమెను చూసి కాస్త చకితుడై తిరిగి ప్రశ్నించలేదు. ఆమె రూపం ఒక్కుమ్మడిగా అతని నయనద్వయానికి మెరుపుతీగలా మెరిసింది. ఆ క్షణంలోనే "ఆమె చాలా అందకత్తె"అని అతని మనస్సులో లిఖింపబడిపోయింది. అతను తిరిగి ప్రశ్నింపలేక తనడేరాకి వెళ్ళిపోయాడు.

ఆరాత్రి ఏడుగంటలకు ఏభైపైబడ్డ వయస్కుడొకడు శశిబాబు డేరాలోకి వచ్చి సలాంచేసి, "సాయంత్రం మా యింటికి వచ్చేరటగా మీరు" అన్నాడు. శశిబాబు అతనివేపు క్షణం తేరిబారచూసేడు. ముగ్గుబుట్టలా నెరసిన తలా, చిరిగిపోయిన బట్టలూ, పెనవేసుకున్న ఫు రి కొ స

జయంతి శ్రీరామమూర్తి

త్రాళ్లలా అగపడుతూన్న నరాలూ, మొద్దుబారి బీటలువారిన అరచేతులూ అతడు ఏ ఆర్థికస్థాయి చెందినవాడో శశిబాబుకి చెబుతూనే ఉన్నాయి.

"అవును. ఆ యిల్లు మీదేనా? నీ పేరెవరు?" అన్నాడు శశి.

"నన్ను రామూ అంటారు. తమరిక్కడ ఏం పని చేస్తారు?"

"భూములు సర్వే చేస్తాం. పదిహేనురోజులు పనివుంది. మాకు ఉదయం, సాయంత్రం పాలు కావాలి. ఎక్కడ దొరుకుతాయి?" అని ప్రశ్నించేడు శశి.

"పాలకు అలా వూరిలోకి పోవాలి. కాని కాస్త వెలుతురుండగానే పంపండి. ఏమంటే ఈ ప్రాంతమంతా పెద్దపులులు..." రామూ.

"అయితే నువ్వెప్పుడయినా పెద్దపులిని చూసేవా?"

"ఒకమారా? ఇన్నిసార్లు చూసేను" అంటూ తన తలమీద గుప్పెడు వెంట్రుకలు చూపించేడు రామూ.

"అయితే నువ్విక్కడ ఏంపని చేస్తుంటావ్?"

"ఏంటో బాబూ! బీదవాళ్లకు జానెడు పొట్టా నింపుకోవడమే పెద్దపని. కూలీనాలీ చేసుకోడం. అడవిలో కట్టెలుకొట్టి అమ్ముకోడం ఇంతే! దేవుడి పుణ్యమాఅంటూ తినేవి పదినోళ్లు లేవు గనక సరిపోతూంది. తిన్నామానినా ఆకిల్లా నేనూ. దానినీ ఒక అయ్యచేతిలో పెట్టేనా, నా బాధ నేను పడగలను" అంటూ తన చరిత్ర ఏకరువు పెట్టేడు రామూ. శశిబాబుకి అతనిమాటలు వింటుంటే జాలి కలిగింది. ఇక అతనిని అక్కడ వుంచడం యిష్టంలేక, "సరే రామూ, పాపం వెళ్లు. మళ్ళీ చుట్టూ పెద్దపులు లున్నాయంటున్నావు" అన్నాడు.

"అవంటే నాకేం భయం బాబూ!"

"నీకు కాదు. మీ అమ్మాయికి-పాపం, వంటరిగా వుంటుంది గదా!"

"ఆమాట నిజమే. శలవు" అంటూ రామూ వెళ్లిపోయేడు.

ఆరాత్రి శశిభూషన్‌కి సరిగా నిద్రపట్టలేదు. రామూ కూతురు అతని మనోవీధిలో యథేచ్ఛగా విహరిస్తూంది. నిజానికి అంతటి అందగత్తెలను కలకత్తా నగరంలో సినీమా రిజర్వుడు క్లాసులలోనూ, పార్కుల్లో జారుతూపోతూన్న బ్యూక్ కారులలోనూ చూసేడుగాని ఇలాటి కుగ్రామంలో పూరిగుడిసెలో ఎన్నడూ అతడు చూడలేదు. ఆ బాలిక ముఖం ఆ రాత్రి అతని మూసిన కళ్ళ ముందే ప్రత్యక్షమై నిద్రని దూరంగా తరిమి వేసింది. చలికి ముఖంమీద రగ్గుకప్పుకుని పండుకొన్నాడు. కాని ఆ రగ్గులో కూడా ఆమె నెమ్మోము అతనికి కనిపిస్తూనే యున్నదా రాత్రి.

మరునాటి ఉదయం శశి లేచి, డేరాముందు తెరలు ఎత్తి కట్టేడు. అతనిదృష్టి సరాసరి బావి వైపునకే ప్రసరించింది. ఆ బాలిక అప్పుడే నీళ్లు తోడుకుని, బిందెతో గుడిసెవైపుగా నడుస్తోంది. ఆమె కట్టుకున్న కావిరంగు చీర మాసిపోయి మోకాలువద్ద కాస్త చిరిగివున్నా ఆమె సోయగాన్ని ఇనుమడిస్తూనే వుంది. ఆమె మళ్ళీ నీటికోసం బావివద్దకు వచ్చింది. శశిభూషన్ ఆమె వైపు చూడకుండా వుండలేకపోయేడు. ఈ మారు ఆమె వెనక్కి వెడుతూ డేరాలవైపు చూసింది. శశిబాబు చేతిలో టీ కప్పు పట్టుకుని తనవైపు చూస్తుండడం గమనించింది. ఆమెలో సిగ్గు దొంతరలు పెనవేసుకున్నాయి. ఆమె చీర చిరుగును ఒక చేతితో దాచుకోబోయి కాస్త తడబడింది. రెండడుగులలో గుడిసె చేరుకుంది. ఆ ముహూర్త బలమెట్టిదో కాని ఆమెలో అతనికి అపూర్వమైన కళా విన్యాసం గోచరించింది.

దినాలు గడుస్తున్నాయి. వీలు దొరికినప్పుడల్లా అతడామెను పరికిస్తూనే వున్నాడు. అంత కన్న ఆమె! వారికళ్ళు తమకే తెలియని సందేశాలు ప్రసారం చేసుకుంటున్నాయి. ఒకనాటి రాత్రి రామూ శశి బాబు డేరాలోకి వచ్చి కూర్చున్నాడు. శశి అతనికి నాలుగు అరటిపళ్లు పెట్టేడు. రామూ రెండుతిని రెండుపళ్లు వేరే వుంచుకున్నాడు.

శశి బాబు "ఏం, అవికూడా తినెయ్" అన్నాడు.

"అవి విమల కిస్తాను" అన్నాడు రామూ.

శశి బాబు పదిలంగా పదిసార్లు ఆ పేరు పునశ్చరణ చేసుకున్నాడు.

"బాబూ తమరికి పెళ్ళి అయిందా" అన్నాడు రాము.

"లేదు" అన్నాడు శశి.

"తమ దేవూరు?"

"కలకత్తా పెద్దపట్టణం ఎప్పుడేనా చూసేవా?"

"లేదు. నాకు అక్కడేం పని బాబూ" అన్నాడు రాము. అతడు వెళ్ళిపోడానికి లేస్తూ, సిగ్గుపడుతూ రెండు రూపాయలుంటే బదు లిమ్మన్నాడు. శశి బాబు సంతోషపూర్వకంగా తీసి యిచ్చేడు.

సర్వేవారి పని ఆ వూళ్ళో పూర్తి అయింది. ఇక రేపు వెళ్ళిపోడానికి శశిబాబు సన్నాహాలు చేసుకుంటున్నాడు. సామానంతా కలకత్తాలో వున్న పెద్ద ఆఫీసుకు తీసుకుపోవాలి. శశి బాబు మనస్సులో సంతోషమూ, విచారమూ సమపాయలుగా పొంగి పొరలుతున్నాయి. కలకత్తా వెళ్ళి తల్లిదండ్రులను చూడాలనే సంతోషమూ, విమలనుండి దూరంగా వెళ్ళిపోతున్నాననే విచారమూ! ఇంతలో రాము వచ్చి "నిన్న రాత్రి మీరు చదివిన పద్యాల పుస్తకం ఒకసారి విమల యిమ్మన్నద"ని అడిగేడు. శశి కాస్త ఆశ్చర్య పడ్డాడుగాని, తీసి యిచ్చేడు.

ఆ పుస్తకం సాయంత్రం శశిబాబు వంటువాని ద్వారా తిరిగివచ్చింది. దాన్ని చేతిలో వుంచుకుని ఏదో ఆలోచిస్తూ ఊరికే పేజీలు తిరగవేస్తున్నాడు. హఠాత్తుగా అతనిదృష్టి ఆఖరు పేజీలో పెన్సిలుతో రాయబడివున్న కొన్ని పంక్తులమీద పడింది. అతడు దాన్ని రెండు మూడు సారులు చదువుకొని నిట్టూర్చి, "ఈరాత్రి పదకొండు గంటలకు - తూర్పు ప్రక్కన ఎర్రగన్నేరు చెట్టుక్రింద" అని గట్టిగా అనుకున్నాడు. అతని మనస్సు వెయ్యికళ్ళను తెచ్చిపెట్టుకుని భవిష్యత్తులోకి తొంగిచూస్తూంది. ఆ వెయ్యి కళ్ళకూ వెయ్యిరకాల విమలలు గోచరిస్తున్నాయి.

రాత్రి పదకొండు గంటలకు శశిభూషన్ డేరాబయటకు వచ్చేడు. ప్రకృతిలో ప్రత్యణువూ నిద్రపోతున్నట్లుంది. బహుళపక్షపు చీకటులు భూమ్యాకాశాలమధ్య పెనవేసుకున్నాయి. అతనికి తెలియకుండానే కాళ్లు శరీరాన్ని ఎర్రగన్నేరువైపునకు మోసుకుపోతున్నాయి. చుట్టూ వున్న ముండ్లపొదలను దాటి అక్కడకు ఎలా చేరుకున్నాడో తనకే తెలియదు. శశిబాబుకు తెలిసినదల్లా అంతకుముందే ఎవరో వచ్చి అక్కడ వున్నారని. అతడు "విమలా" అన్నాడు, గాని జవాబుకు ఎదురుచూడలేదు. రెండునిముషాలు నిశ్శబ్దంగావుండి అతడే మొదలు పెట్టేడు "నన్నెందుకు పిలిచినట్లు?"

"నాకే తెలియదు"

శశి ఆశ్చర్యపడి "పోనీలే. నేను చెబుతాను విను. రేపీవూరు విడిచి కలకత్తా వెళ్లిపోతున్నాను. మరచిపోకేం" అన్నాడు.

"మరచిపోయేవారు మీరే" అన్నదామె.

"అది అసంభవం. నా హృదయంలో నీకూ మీ నాన్నకూ శాశ్వతస్థానం ఏర్పడి పోయింది. ఇదేదో పూర్వజన్మలోని బంధుత్వం అయి వుండాలి" అన్నాడు శశి.

"ఏమిటో, పేదవాళ్ళకి బంధువు లెవరు? మిత్రులెవరు" అని మెల్లగా అన్నది విమల.

"నావిషయంలో మీరల్లా అనుకోవద్దు. మీకు నాచేతనైన ఏ సహాయం కావలసినా చేస్తాను వుత్తరం రాస్తే సరి - పోనీ, ఏమైనా డబ్బు కావాలా, యిచ్చివెడతాను-"

"డబ్బే జీవితంలో సమస్తమూ కాదు."

"అయితే ఏంకావాలో చెప్పు. నన్నెందుకు పిలిచినట్లు" అన్నాడు శశిబాబు. ఆమె చెప్పబోయి, సంకోచించి, "చెబితే మీకు కోపం రావచ్చు" నన్నది.

"ఫరవాలేదు చెప్పు" అన్నాడు శశి.

"నాకు మీరేకావాలి. నేను మీతో వచ్చేస్తాను" అన్నది ఆమె.

శశిబాబు ఒక్కంతగా త్రుళ్ళిపడ్డాడు. విమల చెప్పివేసినందుకు విచారిస్తూ ఇలా అన్నది—

"నాకు ముందే తెలుసు: భూమ్యాకాశాలు ఎన్నడూ ఏకంగావు. మీరు అధికారులు. మేం కూలివాళ్ళం—ఇంతేనా—"

"అదికాదు విమలా. ఈ విషయంలో వాదాకి స్థానంలేదు. కాని... కాని ఈ వూహ నీ మనస్సులోంచి తప్పించు"అనగలిగేడు శశి.

"సరే బాబూ! క్షమించండి"అంటూ విమల ఆ చీకటిలో దూరంగా దూసుకుపోయింది. శశి

బాబు పిలుద్దామనుకున్నాడుగాని, నాలుక స్వాధీనంలో లేనట్లయింది. అతని కాళ్లు తిన్నగా డేరాలోకి దారితీసేయి.

శశిబాబు మంచంమీద మేనువాల్చేడన్నమాటేగాని, అతనిమనస్సుమాత్రం ఎక్కడెక్కడో తిరుగుతూనే వుంది. ఏవేవో కార్యకారణ సంబంధాలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కేవలం సౌందర్యం చూసి, విమలను పెళ్ళిచేసుకోవడం సంభవమా అని అతడు ఎంతోసేపు ఆలోచించేడు. ఇంతలోనే బంధువులూ, మిత్రులూ, అధికారులూ, సాంఘిక స్థాయి, ఉద్యోగపు హోదా—వీటన్నిటినీ మించిన ఆర్థిక అసమానత్వమూ ఇవన్నీ కలిసి తనమీద దాడిచేస్తున్నట్లు భయపడ్డాడు.

మరునాటి ఉదయం శశిబాబు నిద్రమంచం మీద వుండగానే లారీవచ్చి హారన్ మ్రోగించింది. కలకత్తా రైలు పదిగంటలకే అవడంవల్ల డ్రైవరు తొందర చేస్తున్నాడు. తొందరగా సర్వే క్యాంపు చుట్టుచుట్టుకుని లారీలో ఎక్కి కూర్చుంది. ఆ ప్రదేశాన్ని నిర్మానుష్యంచేసి నిష్క్రమించేందుకు పట్టిన పదినిముషాలుకూడా పట్టలేదా లారీకి. వెళ్ళిపోతున్నప్పుడు రామూ యింటివైపు చూడడానికి కూడా శశిబాబుకి ధైర్యంలేకపోయింది.

కలకత్తా వచ్చి స్వంత యింటిలో వుంటూ, ఉద్యోగం చేసుకుంటున్నాడేగాని, శశిభూషన్ ఏదో బెంగపెట్టుకున్నాడు. మధ్యాహ్నం ఎండలోనూ, రాత్రులు లైట్ల కాంతిలోనూ నడుస్తున్నప్పుడు తన వెంటనంటి తిరుగుతూన్న నీడ తనదో, విమలదోనని అప్పుడప్పుడు ఖంగారు పడుతుంటాడు. దానికి తోడు, తల్లిదండ్రులు ఏవేవో పెళ్లి సంబంధాలు చూపిస్తుండడమూ, అతనికి ఏ పిల్లా నచ్చకపోవడమూ జరుగుతూంది. ఇలాగ ఆరునెలలు గడచినమీదట, ఒకనాడు శివపురం మునసబుగారి పిల్లను చేసుకొమ్మని తండ్రి తొందరచేయగా, రెండు వారాలు ఆగి చెబుతానన్నాడు శశిభూషన్. ఆ సాయంత్రమే తల్మా గ్రామపు రామూ పేర ముప్ఫయి రూపాయలు మనియార్డరు చేసి, వెంటనే విమలను వెంటబెట్టుకుని కలకత్తా రమ్మని జాబు రాసేడు.

మూడో రోజునుంచీ శశిబాబు స్టేషనుకు వెడుతుండేవాడు. ఎన్నాళ్లు గడుస్తున్నా వాళ్లు రావడంలేదు సరిగదా వెంటనే జవాబు కూడా రాలేదు. ఆఖరికి పదహారోనాడు ఒక కవరు వచ్చింది. దాన్ని విప్పుకుని, శశి ఇలా చదువుకున్నాడు.

"శ్రీ శశిభూషణబాబుకు రామానందుడు వ్రాయునది. మీరు పంపిన సొమ్ము, జాబు నిన్ననే మాకు యిక్కడ అందినవి. మేము తల్మా గ్రామం విడిచి బొంబాయి వచ్చి సుమారు నాలుగు నెలలయింది. మీరు వెళ్ళిపోయినతర్వాత ఒక సినీమా కంపెనీ వారు మా వూరు వచ్చి, మీరున్న చోటనే క్యాంపువేసి,అడవిలో కొన్ని భాగాలు ఫిల్ము తీసుకున్నారు. వాళ్ళు మా విమల అందాన్ని మెచ్చుకుని ఆ కంపెనీలో నెలకి అయిదువందల జీతంలో ఉద్యోగమిచ్చేరు. మేమిద్దరం వాళ్ళతో కలిసి బొంబాయి వచ్చేశాం. ఇక్కడికి వచ్చిన నెలకే విమల జీతం నెలకి వెయ్యిరూపాయలు చేసేరు. పైగా ఒక కారు కూడా యిచ్చేరు. ఆమె యిప్పుడు రెండు ఫిల్ములలో నటిస్తోంది. బొత్తిగా తీరుబడిలేదు గనక రాలేము—రామానంద్."

తా॥ క॥ మీ ముప్ఫయి రూపాయలతో బాటు ఇదివరలో మీ వద్ద తీసుకున్న రెండూ కలిసి కలిసి మనియార్డరు చేస్తున్నాను.

—"రా"

"ఉత్తరం ముక్కలుముక్కలుగా చించి వెర్రిగా శూన్యంలోకి చూస్తున్నాడు శశి. లోకంలో ఆర్థిక విలువలు ఎంత చంచలమైనదో అతనికి బోధపడింది. ఎంత యత్నించినా అతనికి విమల సౌందర్యం మరపురానంటూంది. అతని రెండు చేతులూ పశ్చాత్తాపమూ, జుగుప్సా రూపంతో తలపట్టుకు క్రుంగదీస్తున్నాయి. అతని తల్లి వెనకాలే వచ్చి,

"ఏమిటిరా నాయనా అలా వున్నావు?" అంది.

"ఏమీలేదు. శివపురం మునసబుగారి సంబంధం రైటు చెయ్యమని నాన్నగారితో చెప్పు" అన్నాడు శశి వెర్రిగా.

★